ఇద్దరి సమరం.. గ్రామానికి నరకం!


12 వ వార్డులో నిర్మాణ పనులకు సంబంధించి తీసిన మురుగు కాలువలు


ముందుకు కదలని మురుగు

- సర్పంచ్, ఉప సర్పంచ్ మధ్య విభేదాలు
- తన బిల్లులు చెల్లించడంలేదంటూ సర్పంచ్ ఆవేదన
- పాలక మండలి చీలిపోవడంతో కొప్పరపాడు గ్రామాభివృద్ధి శూన్యం
- ఎటు చూసినా సమస్యలే..
- రోగాలు ప్రబలుతాయని ప్రజల ఆందోళన

బల్లికురవ: కొప్పరపాడు పంచాయతీ అనాథలా మారింది. సర్పంచ్.. పాలకమండలి మధ్య విభేదాల వల్ల గ్రామం మురికి కూపంగా మారింది. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి వీధుల్లో వ్యర్థాల కుప్పలు, కాలువల్లో మురుగు పేరుకుపోయింది. అసంపూర్తి డ్రైన్ల నిర్మాణంతో తిప్పలు పడాల్సి వస్తోంది. జీతాలు చెల్లించకపోవడంతో గ్రీన్ అంబాసిడర్లు విధులకు హాజరుకావటంలేదు. రిక్షాలు తుప్పుపట్టి మూలన పడ్డాయి. అధ్వానంగా ఉన్న పారిశుద్ధ్యం.. వర్షాల దెబ్బకు ఎలాంటి రోగాలు ప్రబలుతాయోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

5 వేల జనాభా ఉన్నా..

విప్పరపాడు ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీల్లో 5 వేలకు పైగా జనాభా నివశిస్తున్నారు. నార్కెట్‌పల్లి - మేదరమెట్ల నాం రహదారికి తూర్పు.. పడమర భాగాల్లో గ్రామం విస్తరించి ఉంది. 600 మంది విద్యార్థులున్న ఉన్నత పాఠశాల, 3 మోడల్ ప్రాథమిక పాఠశాలల్లో 200 మంది చిన్నారులు విద్య అభ్యసిస్తున్నారు. వ్యర్థాలను చెత్త నుంచి సంపద కేంద్రానికి తరలించేందుకు 3 రిక్షాలతో పాటు ముగ్గురు గ్రీన్ అంబాసిడర్లను నియమించారు. కానీ కూటి ప్రభుత్వలో వీరికి జీతాలు చెల్లించలేదు. స్థానికులు వ్యర్థాలను ప్రధాన వీధులు, ఆలయాలు, చర్చి, మసీదులు ముందు పడవేస్తున్నారు. వర్షాలకు అవి కుళ్లి దుర్గంధాన్ని పంచుతున్నాయి.

అంతా రగడ..

2021 ఫిబ్రవరిలో సర్పంచ్‌గా బందారు వెంకాయమ్మ, ఉప సర్పంచ్‌గా నాగినేని ప్రసన్న కుమారి, మరో 11 మంది వార్డు సభ్యులు పదవీ బాధ్యతలు చేపట్టారు. 2024 మే నెల వరకు పాలకర్గం అంతా అభివృద్ధికి చేయూతనిచ్చారు. ఆ తదుపరి సర్పంచ్, ఉపసర్పంచ్ మధ్య విభేదాలతో పాలక వర్గం రెండు గ్రూపులుగా విడిపోవడంతో పనులు అటకెక్కాయి. సర్పంచ్ తన సొంత నిధులతో అభివృద్ధి పనులకు చేపట్టిన రూ.2.5లక్షలతో పాటు సచివాలయ నిర్వహణకు ఖర్చు చేసిన సుమారు రూ.1 లక్ష తనకు చెల్లించాలని సర్పంచ్ కోరుతున్నారు. ఆ తర్వాత మిగిలిన అభివృద్ధి పనులు టీడీపీ సానుభూతిపరులుగా ఉన్న ఉపసర్పంచ్ చేసుకోవచ్చని సర్పంచ్ చెబుతున్నారు. కాగా ఉప సర్పంచ్ నివాసం ఉండే 12వ వార్డులోని 2 వీధుల్లో సైడు కాల్వల నిర్మాణానికి సంబంధించి పొక్లెయిన్‌తో కందకాలు తీసి 10 నెలలైంది. అయితే ఇరువురి మధ్య విభేదాలు తలెత్తడంతో పనులు ముందుకు సాగటంలేదు.


కొప్పరపాడు గ్రామంలోని శివాలయం ముందు వ్యర్థాల కుప్పలు

పంచాయతీ ఖాతాలో రూ.20 లక్షలు

సర్పంచ్, ఉప సర్పంచ్‌లను సమన్వయ పరచి అభివృద్ధి వైపు అడుగులేయాల్సిన పాలకులు, అధికారులు పట్టీపట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఎంపీడీవో కుసుమకుమారి, డిప్యూటీ ఎంపీడీఓ డి. సుమతికి గ్రామస్తులు అనేకమార్లు ఫిర్యాదు చేశారు. అయితే వారు మాట వినటంలేదంటూ ప్రకటించి అధికారులు చేతులు దులుపుకుంటున్నారు.


మూలన పడవేసిన చెత్త సేకరించే రిక్షా


కొప్పరపాడు గ్రామ పంచాయతీ కార్యాలయం

విభేదాలు ఎప్పుడూ లేవు


గ్రామపంచాయతీ ఏర్పడినప్పటి నుంచి పాలక మండలి మధ్య విభేదాలు ఎప్పుడూ చూడలేదు. పాలకులు, అధికారులు, పాలకమండలిని సమన్వయ పరచి అసౌకర్యాలు లేకుండా చూడాలి.

– మన్నెం ఆంజనేయులు

రోగాలు సోకుతాయని భయపడుతున్నాం


సైడు కాల్వలో మురుగు ముందుకు కదలనందున పగలు రాత్రి తేడా లేకుండా దోమలు దాడి చేస్తున్నాయి. దోమల దాడితో కంటిమీద కునుకు పట్టడంలేదు.

– షేక్ మౌలాలి

అభివృద్ధికి మోకాలడ్డటం తగదు


పాలక మండలి సహకారంతో మూడు సంవత్సరాలు గ్రామాభివృద్ధికి పాటుపడ్డా. 15 నెలలుగా అభివృద్ధికి మోకాలడ్డటంతో గ్రామస్తులకు అవస్థలు తప్పడం లేదు. నాకు చెల్లించాల్సిన బిల్లులు చెల్లిస్తే ఉప సర్పంచ్ గ్రామాభివృద్ధికి పాటుపడతానంటే నాకు ఎలాంటి అభ్యంతరం లేదు.

– బి. వెంకాయమ్మ, సర్పంచ్

కూటమి మోసాలు వివరిద్దాం


వేటపాలెం: బాబుషూరిటీ- మోసం గ్యారెంటీ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు


పర్చూరు మండల ప్రచారంలో నాయకులు, కార్యకర్తలు

పర్చూరు(చినగంజాం): కూటమి ప్రభుత్వ మోసపు హామీలను వాటిని అమలు చేయని తీరు అందరికీ వివరించాలని పర్చూరు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కఠారి అప్పారావు అన్నారు. ఇనగల్లు, తన్నీరువారిపాలెం, ఏదుబాడు, అన్నంబొట్లవారిపాలెంలో మంగళవారం బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమం నియోజక వర్గ ఇన్‌చార్జ్ గాదె మధుసూదనరెడ్డి ఆదేశాల మేరకు మండల పార్టీ కన్వీనర్ కఠారి అప్పారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. మండల పార్టీ నాయకులు లంక శివ, ముప్పాళ్ళ రాఘవయ్య, కంచనపల్లి రమేష్, జంగా అనిల్, కొల్లా శ్రీహరి, గోరంట్ల శివకుమారి, తోకల కృష్ణమోహన్, గాదె సురేష్, కట్ట బుజ్జి, బండి రాంబాబు, కట్ట రత్నరాజు, పాలేరు వీరయ్య, గుజ్జర్లపూడి చిన్న, దాసి నరసింహరావు, ప్రభుదాసు, బెంజిమన్, ఇస్మాయిల్, దాసరి వెంకటరావు, అన్ని గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

ఇంకొల్లు(చినగంజాం): ప్రభుత్వం దుశ్చర్యలను ఎండగట్టాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి బండారు ప్రభాకరరావు అన్నారు. మండలంలోని దుద్దుకూరులో బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అయేషాబుడే, సయ్యద్ లతీఫ్, శంషుద్దీన్, గుంటూరు శ్రీను, కోటి, కరుణాకరరావు, సయ్యద్ సుభాని, నాగరాజు, రామ్, బుజ్జి, అజయ్‌రెడ్డి, హరీష్, యోహాన్, గాబ్రేలు, కేశవులు, జాన్, తదితరులు పాల్గొన్నారు.

చినగంజాంలో..

మండల పార్టీ కన్వీనర్ మున్నం నాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి తిరిగి చంద్రబాబు చేసిన మోసాలను, సూపర్ సిక్స్ హామీలను గురించి ప్రజలకు వివరించారు. కాటుకూరి బాబురావు, పాదర్తి ప్రకాష్, కొల్లాటి ఏడుకొండలు, కేవీ సుబ్బారావు చౌదరి,గెల్లి వెంకట లక్ష్మీనారాయణ, అమరా శ్రీనివాసరావు, ఎస్. సుబ్బారెడ్డి, ఎంవీ రామారావు, ఏ. రామకృష్ణ, మేడికొండ సునీల్, మహ్మద్, జి. ఉమాశంకర్‌రెడ్డి, ఏ. సూర్యనారాయణ రెడ్డి, పటాన్ సైదా, షేక్ బాబు, కరిముల్లా, అక్కల రవి పాల్గొన్నారు.

ప్రజా విశ్వాసం కోల్పోయిన ప్రభుత్వం

వేటపాలెం: ఏడాదిలోపే కూటమి ప్రభుత్వం ప్రజా విశ్వాసాన్ని కోల్పోయిందని వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు సాదు రాఘవ అన్నారు. మంగళవారం రామన్నపేట పంచాయతీలో చీరాల నియోజకవర్గం ఇన్‌చార్జి కరణం వెంకటేష్ ఆదేశాల మేరకు బాబు షూరిటీ మోసం గ్యారెంటీ పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు గతేడాది ఎన్నికల సమయంలో మీ భవిష్యత్తుకు నేనే గ్యారెంటీ అంటూ సభల్లో హామీలు గుప్పించారన్నారు. ఆడబిడ్డనిధి కింద ప్రతి నెలా రూ.1500, అన్నదాత సుఖీభవ కింద రైతులకు ఏడాదికి రూ.20 వేలు, అలాగే 50 ఏళ్లు నిండిన ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు ప్రతి నెలా రూ. 4 వేలు పెన్షన్, నిరుద్యోగ భృతి నెలకు రూ. 3 వేలు ఇస్తానని హామీలు గుప్పించారని గుర్తు చేశారు. అధికారం చేపట్టి 13 నెలలు దాటినా ఒక్క హామీ కూడా అమలు చేయలేదని ఇది ప్రజలను మోసం చేయడం కాదా ? అని ప్రశ్నించారు. హామీలు అమలు చేయాలని డిమాండ్ చేసిన నేతలు, కార్యకర్తలపై అక్రమ కేసులు నమోదు చేయడం సిగ్గు చేటన్నారు. మాజీ అధ్యక్షుడు బొడ్డు సుబ్బారావు, రామన్నపేట సర్పంచ్ కందేటి రమణ, ఉపసర్పంచ్ దంతం వెంకట సుబ్బారావు, మండల మహిళా అధ్యక్షురాలు బాలబర్తిని నర్మదా ప్రశాంతి, యారాసు శ్యామ్, పింజల శారదాంబ, షేక్ హౌలి, వార్డు సభ్యులు కార్యక్తలు పాల్గొన్నారు.


ఇంకొల్లు మండలం దుద్దుకూరులో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు, కార్యకర్తలు


చినగంజాంలో నాయకులు, కార్యకర్తలు

నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరి

చినగంజాం: పొగాకు కొనుగోలు కేంద్రంలో సిబ్బంది నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా చూసి తీసుకోవాలని చీరాల సహాయ వ్యవసాయ సంచాలకులు రత్నకుమారి సూచించారు. మంగళవారం ఆమె చినగంజాంలోని పొగాకు కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి పరిశీలించారు. మంగళవారం 13 మంది రైతుల వద్ద 250 క్వింటాళ్ళ పొగాకును కొనుగోలు చేసినట్లు తెలిపారు. తహసీల్దార్ జీవి గుంట ప్రభాకరరావు, వ్యవసాయాధికారి ఆర్. చంద్రశేఖర్, వ్యవసాయ సిబ్బంది, కొనుగోలు కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు. మంగళవారం సాయంత్రం చినగంజాం పొగాకు కొనుగోలు కేంద్రాన్ని మార్క్‌ఫెడ్ ప్రాజెక్ట్ మేనేజర్ సుబ్రహ్మణ్యం సందర్శించారు.

ఆర్‌డీఎస్ఎస్ పనుల పరిశీలన

వేటపాలెం: చీరాల డివిజన్ పరిధిలోని వేటపాలెం మండలం పరిధిలో విద్యుత్ ఆర్‌డీఎస్ఎస్ స్కీమ్ కింద జరిగిన పనులను చీఫ్ సెక్రటరీ విజయానంద్ మంగళవారం పరిశీలించారు. వేటపాలెం మండల పరిధిలోని దేశాయి పేట నీలకంఠాపురం దగ్గరలో గల 132 కేవీ సబ్ స్టేషన్ నుంచి రామన్న పేట వద్ద గల 33 కేవీ సబ్ స్టేషన్ వరకు 132 కేవీ విద్యుత్ హైటెన్షన్ లైన్ వర్కు.. ఆర్‌డీఎస్ఎస్ స్కీమ్ కింద జరుగుతున్నాయి. సీఎండీ పుల్లారెడ్డి, సీసీఎం హెచ్‌ఆర్ లింగమూర్తి, ఎస్ఈ ఆంజనేయులు, ఈఈ థామస్, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

ఆడపిల్లలు అప్రమత్తంగా ఉండాలి

ఇంకొల్లు(చినగంజాం): ఆడపిల్లలు ఇంటా బయట నిరంతరం అప్రమత్తంగా ఉండాలని చీరాల సబ్ డివిజన్ శక్తి బృందం ఇన్‌చార్జ్ ఎస్ఐ బి. హరిబాబు అన్నారు. మంగళవారం ఇంకొల్లు మండలంలోని గౌతమి స్కూల్, కాలేజీలో మత్తుమందులు, ర్యాగింగ్, నేరాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి మహిళ ఫోన్‌లో శక్తి యాప్ ఉంచుకోవాలని సూచించారు. ఇంకొల్లు సీఐ వైవీ రమణయ్య, ఎస్ఐ జి. సురేష్, పాఠశాల డైరెక్టర్ కాట్రగడ్డ శ్రీనివాసరావు, ధనలక్ష్మి, లోకేష్, సుబ్బారావు పాల్గొన్నారు.

కారు అద్దాలు ధ్వంసం

మార్టూరు: మండల కేంద్రం మార్టూరులో సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు ఓ వ్యక్తికి చెందిన కారు అద్దాలను ధ్వంసం చేశారు. స్థానిక బలరాం కాలనీకి వెళ్లే మార్గంలో సమీప నివాసాలకు చెందిన కొందరు ఖాళీ స్థలంలో తమ కారులను రాత్రిపూట నిలుపుకుంటారు. అదేవిధంగా స్థానికుడైన ఉప్పుటూరి జానకిరావు సోమవారం రాత్రి తన మారుతి సుజుకి కారును యథాప్రకారం పార్కింగ్ స్థలంలో ఉంచాడు. మంగళవారం ఉదయం కారు గమనించిన జానకిరావు తన కారు అద్దాలు ముందు, వెనుక రెండువైపులా ధ్వంసం కావడాన్ని గమనించాడు. కారు వెనుక సీటులో ఓ పెద్ద బండ రాయి పడి ఉండటాన్ని చూశాడు.

బైక్‌ను ఢీకొన్న కారు

చీరాల: ద్విచక్రవాహనదారుడిని కారు ఢీకొన్న సంఘటనలో వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన మంగళవారం సాయంత్రం స్థానిక వడ్డెసంఘం వద్ద చోటుచేసుకుంది. పీటర్ అనే వ్యక్తి ద్విచక్రవాహనంపై వస్తుండగా వెనుక నుంచి వచ్చిన కారు ఢీకొట్టింది. 108లో చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు.

ఎంఈఓకు అభినందనలు

చీరాల: చీరాల నూతన ఎంఈఓగా బాధ్యతలు చేపట్టిన టి.రమాదేవిని మంగళవారం ఏపీటీఎఫ్ నాయకులు అభినందనలు తెలిపారు. యూనియన్ నాయకులు కె.వెంకటేశ్వరరెడ్డి, చుక్కా శ్రీనివాసరావు, జి.నాగమల్లేశ్వరరావు, చేజర్ల శ్రీను, ఆలూరి శ్రీను దితరులు పాల్గొన్నారు.

తైక్వాండో పోటీల్లో పతకాలు

చినగంజాం: జాతీయ తైక్వాండో పోటీల్లో చినగంజానికి చెందిన పలువురు విద్యార్థులు పతకాలు సాధించారు. ఈ నెల 25,26,27 తేదీల్లో విజయవాడ చెన్నుపాటి రామకోటయ్య స్టేడియంలో నిర్వహించిన 10 వ జాతీయ తైక్వాండో పోటీల్లో చినగంజాం సత్యం హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా తైక్వాండో కార్యదర్శి షేక్ అబ్దుల్ సలాం ఆధ్వర్యంలో వివిధ విభాగాల్లో ఆరుగురు విద్యార్థులు పతకాలు సాధించారు. బి. మహాలక్ష్మి, డ. దేవాదిత్య స్వర్ణ పతకాలను, కె. శ్రీ దుర్గ హర్షిత, కే రక్షితారెడ్డి రజిత పతకాలను, ఎం. జనని, సీహెచ్ అవిత కాంస్య పతకాలను సాధించారు. కరస్పాండెంట్ నున్నా హరనాథ్ బాబు, ఉపాధ్యాయ సిబ్బంది, తైక్వాండో కోచ్ వాటుపల్లి సుబ్రహ్మణ్యం, క్రీడాకారుడు పొగడదండ శివప్రసాద్ అభినందించారు.


తైక్వాండో పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందిస్తున్న ఉపాధ్యాయ సిబ్బంది

వేటపాలెం: సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ విద్యార్థులు జాతీయ స్థాయి తెక్వాండో పోటీల్లో బంగారు, క్యాంస్య పతకాలు సాధించారని కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ ఎస్. లక్ష్మణరావు తెలిపారు. మంగళవారం జరిగిన అభినంద సమావేశంలో ప్రిన్సిపాల్ కె. జగదీష్ బాబు వివరాలు వెల్లడించారు.

గాయపడిన విద్యార్థికి ఆర్థిక సాయం

వేటపాలెం: రోడ్డు ప్రమాదంలో గాయపడిని విద్యార్థికి పాఠశాల ఉపాధ్యాయులు రూ.15 వేలు ఆర్థిక సహాయాన్ని మంగళవారం అందజేశారు. రామచంద్రాపురం మత్స్యకార గ్రామానికి చెందిన కోడూరు సిరి, తమ్ముడు పూర్ణచంద్రావు పందిళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో 6,8 తరగతులు చదువుతున్నారు. అయితే ఇటీవల గ్రామం నుంచి మోటార్ బైక్ పై పాఠశాలకు వస్తూ ప్రమాదశాత్తు తీవ్రంగా గాయపడ్డారు. బాలుడికి కాలు, చేయి ఫ్రాక్చర్ అయింది. విషయం తెలుసుకున్న ప్రధానోపాధ్యాయురాలు తలపల దీప్తి, పాఠశాల్లో ఉపాధ్యాయులు కలిసి సేకరంచిన రూ. 15 వేలు నగదు వైద్య ఖర్చుల నిమిత్తం అందజేశారు. బుద్ధి మోహన్‌రావు, ఎస్. లలితా పరమేశ్వరి, సీహెచ్ భవానీదేవి, సూర్యనారాయణ పాల్గొన్నారు.


విద్యార్థి తల్లికి ఆర్థిక సహాయం నగదు అందజేస్తున్న ఉపాధ్యాయులు

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించండి


మార్టూరులో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

మార్టూరు: ప్రభుత్వం ప్రజలపై అదనపు భారం వేస్తూ ఏర్పాటు చేస్తున్న విద్యుత్ స్మార్ట్ మీటర్లను నివాసాల్లో బిగించకుండా అడ్డుకుందామని సీపీఎం నాయకుడు బత్తుల హనుమంతరావు పిలుపునిచ్చారు. మార్టూరులో మంగళవారం స్థానిక మహిళలతో కలిసి ప్ల కార్డులతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. వై. రాంబాబు, స్థానిక మహిళలు పాల్గొన్నా

విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ


తిమ్మనపాలెంలో సైకిళ్లను అందచేస్తున్న మంత్రి గొట్టిపాటి

మేదరమెట్ల: కొరిశపాడు మండలంలోని తిమ్మనపాలెం జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలోని విద్యార్థులకు విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మంగళవారం సైకిళ్లు పంపిణీ చేశారు. స్వచ్ఛంద సంస్థల సహకారంతో అందచేసిన 131 సైకిళ్లను అందచేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నీటితీరువా వసూళ్లు వేగవంతం చేయాలి

చీరాల టౌన్: నీటి తీరువా వసూళ్లను నెలాఖరు కల్లా పూర్తి చేయడంతో పాటుగా అర్జీలను విచారించి పరిష్కరించాలని తహసీల్దార్ కుర్రా గోపీకృష్ణ సూచించారు. మంగళవారం మాట్లాడుతూ మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లోన్న వ్యవసాయ భూములకు సంబంధించి నీటి తీరువా రూ.44 లక్షలు వసూళ్ల లక్ష్యంగా గ్రామ రెవెన్యూ అధికారులు పనులు చేయాలన్నారు. డిప్యూటీ తహసీల్దార్ సుశీల, గ్రామ, పట్టణ వీఆర్వోలు ఉన్నారు.

క్లుప్తంగా

పౌష్టికాహారంతో వ్యాధి నిరోధకశక్తి


కిట్లను పంపిణీ చేస్తున్న వైద్యాధికారి

అద్దంకి: టీబీ వ్యాధిగ్రస్తులు పౌష్టికాహారం తీసుకుంటే వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని వైద్యాధికారి డాక్టర్ వాహిలా చౌదరి అన్నారు. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో 200 మందికి పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. డాక్టర్ పి. వెంకట కిరణ్‌కుమార్, ఎస్. తేజస్వి, అనితా జ్యోతి, ప్రదీప్, సీహెచ్‌సీ హెచ్‌డీఎస్ కమిటీ సభ్యుడు ధర్మవరపు నాగేశ్వరరావు, జిల్లా పీఈఎం కో ఆర్డినేటర్ కార్తీక్, టీబీ యూనిట్ సిబ్బంది పాల్గొన్నారు.


చీరాల రూరల్: క్షయ వ్యాధిగ్రస్తులు క్రమం తప్పకుండా మందులు వాడుకుంటూ, పౌష్టికాహారం తీసుకోవాలని చీరాల ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీకాంత్ సూచించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం చీరాల టీబీ యూనిట్ ఆధ్వర్యంలో 53 మంది క్షయ వ్యాధిగ్రస్తులకు వైద్యశాల సూపరింటెండెంట్ శ్రీకాంత్ చేతుల మీదుగా పౌష్టికాహారం అందజేశారు. క్షయవ్యాధి అంటువ్యాధి కనుక వ్యాధి బాధితులు జాగ్రత్తగా ఉండాలన్నారు. డాక్టర్ శిరీష, డాక్టర్ ప్రణయ్, డాక్టర్ డాక్టర్ మనీష నంద, టీబీ యూనిట్ సిబ్బంది వర్షధార, శ్రీలక్ష్మి, భవ్య, సి. నీలిమ, గాంధి, టి. నరేంద్రబాబు, రియాజ్, టి. హరికాంత్ పాల్గొన్నారు.

కార్మికులపై లాఠీచార్జి అమానుషం


నిరసన తెలియజేస్తున్న కార్మికులు

అద్దంకి: తమ డిమాండ్ల సాధన కోసం నిరవధిక సమ్మె చేస్తున్న సమయంలో కార్మికులపై లాఠీ చార్జి చేయడం అమానుషమని సీఐటీయూ నాయకుడు తంగిరాల వెంకటేశ్వర్లు అన్నారు. నెల్లూరులో సమ్మె సమయంలో కార్మికులపై పోలీసులతో లాఠీ చారి చేయించడాన్ని నిరసిస్తూ మంగళవారం స్థానిక మునిసిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నెల్లూరులో సమ్మె చేస్తున్న కార్మికుల స్థానంలో కొత్త కార్మికులను తీసుకుచ్చిన క్రమంలో అభ్యంతరం చెప్పడంతో పోలీసులతో కార్మికులపై లాఠీ చార్జి చేయించారని ఆవేదన వ్యక్తం చేశారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు పి. ఆదాం, దాసరి వీరయ్య, ఉసురుపాటి శామ్యూల్, ఎం. కోటయ్య, ఎం. రమేష్, ఏ. రవితేజ, రాఘవయ్య, అలివేలమ్మ కార్మికులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ అధ్యక్షుల ప్రమాణ స్వీకారం


జాగర్లమూడివారిపాలెం సొసైటీ నూతన పాలక మండలి అధ్యక్షులు, సభ్యులు

జె.పంగులూరు: మండల పరిధిలోని కోటపాడు, జాగర్లమూడివారిపాలెం సొసైటీ అధ్యక్ష, కార్యదర్శుల ప్రమాణ స్వీకారం మంగళవారం జరిగింది. జాగర్లమూడివారిపాలెం సొసైటీ పాలక మండలి అధ్యక్షులుగా అల్లంనేని బ్రహ్మానంద స్వామి, సభ్యులుగా దుళిపాళ్ళ ప్రసన్నాజనేయులు, మట్టకొయ బ్రహ్మయ్య ప్రమాణ స్వీకారం చేశారు. కోటపాడు సొసైటీ పాలకమండలి అధ్యక్షులుగా రావుల సింగరకొండ, సభ్యులుగా మక్కెన ఆంజనేయులు, కట్టా సుబ్బారావు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో రావూరి రమేష్, కుక్కపల్లి ఏడుకొండలు, సహదేవుడు, గరిమిడి జగన్‌మోహన్‌రావు పాల్గొన్నారు.

ఉపాధి సొమ్ము రికవరీకి సిఫార్సు


కేవీ పాలెం గ్రామ సభల్లో మాట్లాడుతున్న ఎస్ఆర్‌పీ

బల్లికురవ: ఉపాధి పథకం కాసుల వర్షం కురిపిస్తోంది. మండలంలోని కొమ్మినేని వారిపాలెం, గుంటుపల్లి, వైదన గ్రామాల్లో మంగళవారం జరిగిన గ్రామ సభల్లో రూ. 48 లక్షలమేర అవినీతి జరిగినట్లు తనఖీ బృందాలు రికవరీకి సిఫార్సు చేశారు. 2024- 25 ఆర్థిక సంవత్సరానికి మండలంలోని 21 గ్రామ పంచాయతీల్లో రూ. 12 కోట్లమేర పనులు చేశారు. సామాజిక తనిఖీలో భాగంగా ఇప్పటికి 15 పంచాయతీల్లో రూ. 2.5 కోట్ల మేర అవినీతి జరిగినట్లుగా తనిఖీ బృందాలు గుర్తించి రికవరికి సిఫార్సు చేశారు. ఆగస్టు 6న బల్లికురవలో జరిగే ప్రజావేదికలో అవినీతి పూర్తిస్థాయిలో బయటపడనుంది. ఏపీఓ రమాదేవి, ఎస్ఆర్‌పీలు తులసీనాయక్, కనకరావు, పీఆర్‌పీలు పాల్గొన్నారు.